తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | ఆదివారం - 19- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 45 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in


# కల్తీలపై కఠిన చట్టం అమలు చేయండి

**ఆహార, ఔషధ కల్తీల నిరోధానికి సమగ్ర చట్టం రూపొందించాలని సీఎం ఆదేశం**

**విజిల్ బ్లోయర్ వ్యవస్థ, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని సూచన**

**విదేశీ విధానాల అధ్యయనం చేసి బిల్లును సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):**

ఆహార పదార్థాలు, ఔషధాల్లో కల్తీలను అరికట్టేందుకు కఠినమైన తెలంగాణ ఆహార కల్తీ, ఔషధ నియంత్రణ చట్టాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కల్తీల వల్ల ప్రజారోగ్యంపై పడుతున్న ప్రభావంపై విస్తృతంగా చర్చించారు. నిత్యావసర వస్తువులు, కూరగాయలు, పండ్లు, పాలు వంటి ఆహార పదార్థాల్లో పెరుగుతున్న కల్తీలు ప్రజలను తీవ్ర అనారోగ్యాలకు గురిచేస్తున్నాయని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు, పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వినియోగిస్తున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అలాగే ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల్లో రసాయన అవశేషాలు పెరుగుతున్నాయని, దీనివల్ల కొన్ని దేశాలు దిగుమతులను కూడా నిరాకరిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు.

మిగతా 2లో



# అందెశ్రీ నాకు ఆత్మబంధువు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఘట్‌కేసర్‌లో ప్రజాకవి అందెశ్రీ స్మృతివనానికి శంకుస్థాపన

**హైదరాబాద్, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, ప్రజాకవి డాక్టర్ అందెశ్రీ తనకు ఉద్యమకారుడే కాకుండా ఆత్మబంధువని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అందెశ్రీ జయంతి సందర్భంగా ఘట్‌కేసర్‌లో ఏర్పాటు చేయనున్న స్మృతివన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. అందెశ్రీ గానంలో, ఆయన గళంలో ఉన్న ఉద్యమ స్ఫూర్తి తన రాజకీయ ప్రస్థానానికి ప్రేరణగా నిలిచిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

మిగతా 2లో




## మహిళా సాధికారతకు ప్రభుత్వం పూర్తి సహకారం

- ఎఫ్ఎల్‌వో ప్రధాన కార్యాలయానికి వెయ్యి గజాల స్థలం కేటాయిస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో



# వాతావరణ మార్పులతో అప్రమత్తం

- సూపర్ ఎల్‌నినో ప్రభావంపై ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ
- వర్షపాతం అనిశ్చితికి తగ్గట్టుగా నీటి నిర్వహణపై దృష్టి
- రైతులు, ప్రజల ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):**

వాతావరణ మార్పుల ప్రభావంతో నిపుణులు పేర్కొంటున్న "సూపర్ ఎల్‌నినో" పరిస్థితులు ఈ ఏడాది రుతుపవనాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున తెలంగాణ ప్రభుత్వం ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన వాతావరణ మార్పులపై సదస్సులో ముఖ్యోపన్యాసం చేసిన ఆయన, చారిత్రక వర్షపాతం నమూనాలు మారిపోతుండటంతో నీటి వనరుల ప్రణాళికలో కొత్త విధానాలను అవలంబించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు.

మిగతా 2లో


# ప్రభుత్వ ఆస్పత్రులకు పెరుగుతున్న ఆదరణ


- రోగుల సంఖ్యలో పెరుగుదల
- సేవల నాణ్యతకు ప్రాధాన్యం
- నిర్లక్ష్యంపై కఠిన హెచ్చరిక
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

**హైదరాబాద్, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు గణనీయంగా మెరుగుపడిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. నాణ్యమైన వైద్య సేవలు అందుతుండటంతో ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోందని, అదే సమయంలో ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య తగ్గుతోందని ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలే చెబుతున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో ప్రభుత్వ సాధారణ ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు సహా వంద పడకలకుపైగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల

మిగతా 2లో





# బూత్ గెలిస్తేనే ఎన్నికల్లో విజయం

- ప్రతి కార్యకర్త బూత్‌పైనే దృష్టి పెట్టాలి
- ప్రజలకు ప్రత్యామ్నాయం బీజేపీయేనని వ్యాఖ్య
- ఎస్ఐఆర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని పిలుపు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు

**హైదరాబాద్, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):**

ఎన్నికల్లో విజయం సాధించాలంటే ముందుగా ప్రతి బూత్‌లో పార్టీ బలోపేతం కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు అన్నారు. శనివారం సికింద్రాబాద్ జిల్లా బీజేపీ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. పార్టీ విజయానికి బూత్ స్థాయి సంస్థాగత నిర్మాణమే పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ప్రతి కార్యకర్త బూత్ స్థాయిలో అహర్నిశలు శ్రమించి పార్టీని బలోపేతం చేయాలని రామచంద్రరావు పిలుపునిచ్చారు. ప్రజలతో నిరంతరం మమేకమై కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలే ప్రధాన బలమని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలు, ఎన్నికల హామీల అమలులో నిర్లక్ష్యం కారణంగా ప్రజలు విసిగిపోయారని రామచంద్రరావు విమర్శించారు. అభివృద్ధి, పారదర్శక పాలనను అందించగల ప్రత్యామ్నాయం భారతీయ జనతా పార్టీ మాత్రమేనని ఆయన పేర్కొన్నారు.

మిగతా 2లో

# యువతకు అండగా ఉంటా: కేటీఆర్

- యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ విమర్శలు
- యూత్ డిక్లరేషన్ పేరుతో యువతను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపణ
- తెలంగాణ పరిశ్రమల తరలింపుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శలు
- యువతకు అండగా ఉంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ హామీ

**హైదరాబాద్, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):**

కాంగ్రెస్ ప్రభుత్వం యూత్ డిక్లరేషన్ పేరుతో తెలంగాణ యువతను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. యువ సంగ్రామ సదస్సులో నిరుద్యోగ యువతను ఉద్దేశించి మాట్లాడిన ఆయన, ఎన్నికల హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. యువత ఆశలను వమ్ము చేసిన ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు.

మిగతా 2లో



# ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

- వీపనగండ్లలో సమీక్ష నిర్వహించిన మంత్రి జూపల్లి కృష్ణారావు
- అర్హులైన ప్రతి ఓటరును నమోదు చేయాలని సూచన
- ఉత్తమ పనితీరు కనబరిచిన బీఎల్‌వోలు, బీఎల్ఏలకు నగదు ప్రోత్సాహకాలు




**వనపర్తి, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. శనివారం వీపనగండ్లలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో బూత్ లెవల్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఏజెంట్లతో సమీక్ష నిర్వహించిన మంత్రి గ్రామాల వారీగా ప్రక్రియ పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# కల్తీలపై కఠిన చట్టం అమలు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ పరిస్థితిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

సేంద్రియ ఉత్పత్తుల పేరుతో మార్కెట్‌లో విక్రయిస్తున్న వస్తువుల నాణ్యతను నిర్ధారించే వ్యవస్థలు బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి సూచించారు. అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేస్తున్న ఉత్పత్తులు నిజంగా సేంద్రియమైనవేనా అనే అంశంపై వినియోగదారులకు స్పష్టత కల్పించే విధానాలు రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. కల్తీల నియంత్రణకు సమగ్ర చట్టాలు అమలులో ఉన్న దేశాలను సందర్శించి అక్కడి విధానాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆ అధ్యయనాల ఆధారంగా




సమగ్ర నివేదిక సిద్ధం చేసి, దాని ప్రకారం బిల్లును రూపొందించి శాసనసభలో చర్చకు తీసుకురావాలని ఆదేశించారు. చట్టం రూపకల్పనలో ప్రజల అభిప్రాయాలు కూడా స్వీకరించాలని సూచించారు.

కల్తీలకు సంబంధించిన సమాచారం సేకరించేందుకు విజిల్ బ్లోయర్ వ్యవస్థతో పాటు ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కల్తీల నియంత్రణ చర్యలను ముందుగా క్యూర్ ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసి, వాటి ఫలితాలను పరిశీలించిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రాష్ట్ర పోలీసు ప్రధాన అధికారి సీవీ ఆనంద్, ముఖ్యమంత్రి సలహాదారు, ఉన్నతాధికారులు, వివిధ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ కల్తీల నిర్మూలనకు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# అందెశ్రీ నాకు ఆత్మబంధువు

(మొదటి పేజీ తరువాయి)

తన కుటుంబంలో పెద్దన్నను కోల్పోయిన తర్వాత అందెశ్రీలోనే ఆ అనుబంధాన్ని చూసుకున్నానని భావోద్వేగంగా గుర్తు చేసుకున్నారు.

తెలంగాణపై ఎవరైనా ఆధిపత్యం చెలాయించాలని ప్రయత్నిస్తే ప్రతి తరంలోనూ మరో అందెశ్రీ పుడతారని అన్నారు. అందెశ్రీ, గద్దర్ వంటి మహనీయుల ఉద్యమ స్ఫూర్తే ప్రజా ప్రభుత్వానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. అందెశ్రీ రచించిన "జయ జయహే తెలంగాణ "మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు" వంటి గీతాలు కేవలం పాటలు మాత్రమే కాకుండా తెలంగాణ ఉద్యమానికి ఆయుధాలుగా మారాయని కొనియాడారు. ప్రజల్లో ఉద్యమ చైతన్యాన్ని రగిలించిన మహోన్నత కవిగా అందెశ్రీని స్మరించారు.

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2024 జూన్ 2న "జయ జయహే తెలంగాణ" గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించిన సందర్భంగా అందెశ్రీ భావోద్వేగానికి గురైన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, అందెశ్రీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు ప్రభుత్వం పూర్తి సహకారం

- **ఎఫ్ఎల్‌వో ప్రధాన కార్యాలయానికి వెయ్యి గజాల స్థలం కేటాయిస్తాం**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో మహిళా సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, భారతీయ పరిశ్రమల సమాఖ్య మహిళా విభాగం (ఎఫ్ఎల్‌వో) ప్రధాన కార్యాలయ నిర్మాణానికి శిల్పారామం సమీపంలో వెయ్యి గజాల స్థలాన్ని కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.ఫిక్కీ మహిళా విభాగం ఏర్పాటై25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో ఎఫ్ఎల్‌వో ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు.

మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు



చేపడుతోందని తెలిపారు. హైటెక్ సిటీ ప్రాంతంలో ఎఫ్ఎల్‌వో కార్యాలయం ఏర్పాటు కావడం ద్వారా ఆ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని అన్నారు.ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో ఫిక్కీ భాగస్వామ్యం కావాలని కోరిన ముఖ్యమంత్రి, ఫిక్కీ ప్రధాన కార్యాలయం కోసం ఒక ఎకరం స్థలాన్ని కేటాయిస్తామని వెల్లడించారు. మహిళా పారిశ్రామికవేత్తల పాత్ర రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో కీలకమని పేర్కొన్నారు.

మహిళా సాధికారత కోసం మరో పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని, మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష సమావేశాలు నిర్వహించి వారి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. వ్యాపార రంగంలో విశేషంగా రాణిస్తున్న మహిళలను ప్రతి ఏడాది ఎఫ్ఎల్‌వో ఆధ్వర్యంలో పురస్కారాలతో సత్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు, ఎఫ్ఎల్‌వో జాతీయ అధ్యక్షురాలు పూజా గార్గ్, ఎఫ్ఎల్‌వో హైదరాబాద్ చైర్‌పర్సన్ సీతా రెడ్డి గడ్డం, మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# వాతావరణ మార్పులతో అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో ఇప్పటికే వాతావరణ మార్పుల ప్రభావం కనిపిస్తోందని మంత్రి పేర్కొన్నారు. గత రెండున్నర సంవత్సరాలుగా అనుకూల వర్షాలు కురవడంతో జలాశయాలు నిండుగా ఉండి సాగునీరు, తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురుకాలేదని, అయితే ప్రస్తుత సీజన్‌లో వర్షపాతం లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. జలాశయాల్లో నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో పరిస్థితిని అత్యంత జాగ్రత్తగా నిర్వహిస్తున్నామని చెప్పారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంపై అంతర్జాతీయ శాస్త్రీయ అధ్యయనాలను ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. వర్షాభావ పరిస్థితులు తలెత్తితే ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు నీటిపారుదల, వ్యవసాయం, తాగునీరు, పౌర సరఫరాల శాఖలు పరస్పర సమన్వయంతో ముందస్తు ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను అమలు చేస్తున్నాయని వెల్లడించారు. సంక్షోభం ఏర్పడిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే చర్యలు తీసుకోవడమే ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు.

వాతావరణ అనిశ్చితి కారణంగా నీటి లభ్యత, సాగు విధానాలు, జలాశయాల నిర్వహణలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని మంత్రి పేర్కొన్నారు. గత అనుభవాల ఆధారంగా కాకుండా ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నీటి నిర్వహణ వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్రీయ సమాచారంతో జలాశయాల నిర్వహణ, వ్యవసాయ శాఖల మధ్య సమన్వయం, ముందస్తు ప్రణాళికల ద్వారా రైతులకు రక్షణ కల్పించగలమని తెలిపారు.

నీటి నిర్వహణ అనేది కేవలం పరిపాలనా అంశం మాత్రమే కాదని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, ఆహార భద్రత, గ్రామీణాభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటి వనరులను సమర్థంగా నిర్వహించడంలో విఫలమైతే వ్యవసాయం, పరిశ్రమలు, పట్టణ తాగునీటి సరఫరా, పెట్టుబడులు, దీర్ఘకాలిక ఆర్థికాభివృద్ధిపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. హైదరాబాద్‌కు గోదావరి, కృష్ణా నదుల నుంచి తాగునీటి సరఫరా దీర్ఘకాలికంగా భద్రంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని మంత్రి తెలిపారు. అయితే భూగర్భ జలాల మట్టం క్రమంగా పడిపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. వర్షపు నీటి సంరక్షణను విస్తృతంగా అమలు చేయడంతో పాటు చెరువులు, జలవనరుల పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇస్తున్నామని, సహజ నీటి మార్గాలను పరిరక్షించడం ద్వారా భవిష్యత్‌లో వరదలు, కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుతున్నామని మంత్రి వివరించారు.

# యువతకు అండగా ఉంటా: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

యువత సమస్యలను తాను అర్థం చేసుకుంటానని, ఒక అన్నగా ప్రతి యువకుడికి అండగా నిలుస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. తెలంగాణ కోసం పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడాన్ని చూస్తూ ఊరుకోబోమని అన్నారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

తెలంగాణలో యువత ఆలోచనలకు ప్రోత్సాహం కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం టీ హబ్, టీ వర్క్స్ వంటి సంస్థలను ఏర్పాటు చేసిందని కేటీఆర్ పేర్కొన్నారు. వాటి ద్వారా ఎన్నో వినూత్న ఆవిష్కరణలకు అవకాశం కల్పించామని చెప్పారు. టీ హబ్‌లో రూపుదిద్దుకున్న స్కైరూట్ సంస్థ దేశ చరిత్రలో తొలిసారిగా ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించడం తెలంగాణ ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. పరిశ్రమలను రాష్ట్రంలో నిలబెట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. మరోవైపు తెలంగాణ నుంచి పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయని, దీనిపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని కూడా ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రయోజనాల గురించి మాట్లాడితే ప్రాంతీయవాదమని విమర్శించడం సరైంది కాదని వ్యాఖ్యానించారు.

రాష్ట్ర యువతకు ఉద్యోగాలు, పెట్టుబడులు, పరిశ్రమలు అత్యంత కీలకమని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణలో ఏర్పాటైన పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోకుండా ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణలో రాజీ పడబోమని స్పష్టం చేశారు. యువ సంగ్రామ సదస్సులో పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. యువత సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ హామీల అమలుపై ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కేటీఆర్ తెలిపారు.

# బూత్ గెలిస్తేనే ఎన్నికల్లో విజయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పార్టీ శ్రేణులు ప్రతి దశలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఓటర్లకు అవసరమైన సహకారం అందిస్తూ పార్టీ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి బూత్‌లో పార్టీ బలోపేతానికి కార్యాచరణ రూపొందించాలని, సమన్వయంతో పనిచేస్తే ఆశించిన ఫలితాలు సాధించవచ్చని రామచంద్రరావు అన్నారు. ప్రజల్లో పార్టీపై విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ సంస్థాగత బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో చర్చించినట్లు నాయకులు తెలిపారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా వలస వెళ్లిన ఓటర్లను ప్రత్యేకంగా గుర్తించి, వారిని ఫోన్ ద్వారా సంప్రదించి ఓటరు నమోదుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని బీఎల్‌వోలు, బీఎల్ఏలకు సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయింపుకు గురికాకుండా క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పనిచేయాలని అన్నారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా అత్యంత సమర్థవంతంగా పూర్తి చేసిన బూత్ లెవల్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఏజెంట్లను ప్రోత్సహించేందుకు నగదు బహుమతులు అందజేస్తామని మంత్రి ప్రకటించారు. తొలి బహుమతిగా రూ.10 వేల నగదు, ద్వితీయ బహుమతిగా రూ.5 వేల నగదు అందజేయనున్నట్లు తెలిపారు.

ఈ ప్రోత్సాహకాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని మంత్రి కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడికి ఆ హక్కు అందేలా సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో బూత్ లెవల్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఏజెంట్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. గ్రామాల వారీగా ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు.

# ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం

- **ఒక్కరోజే 840 ఎకరాలకు రక్షణ**
- **రూ.30 వేల కోట్ల ప్రభుత్వ భూమిని రక్షించిన హైడ్రా**
- **శంషాబాద్, రాయదుర్గం, కంటోన్మెంట్‌లో భారీ చర్యలు**

**హైదరాబాద్, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):**

నగరం నలువైపులా హైడ్రా శనివారం భారీ స్థాయిలో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల్లో ఒకే రోజు మొత్తం 840 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి రక్షించింది. ఈ భూముల విలువ రూ.30 వేల కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భారీ పోలీసు బందోబస్తుతో రెవెన్యూ అధికారుల సమన్వయంతో ఈ చర్యలు చేపట్టగా, తప్పుడు పత్రాలు, సర్వే నంబర్లతో ప్రభుత్వ భూములను కాజేయాలన్న ప్రయత్నాలకు అడ్డుకట్ట పడింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలోని సర్వే నంబర్లు 25, 26లో ఉన్న 650 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. అలాగే శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని సర్వే నంబర్ 46లో ఉన్న 84 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించింది. మేడ్చల్‌మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాల పరిధిలోని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో 106 ఎకరాల ప్రభుత్వ భూమికి కూడా ఫెన్సింగ్ వేసి ఆక్రమణలను అడ్డుకుంది.

శంషాబాద్ మండలంలోని బహదూర్‌గూడలో విమానాశ్రయం రన్‌వే సమీపంలో ఉన్న 650 ఎకరాల భూమిపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు కన్నేశారని అధికారులు తెలిపారు. పాత రెవెన్యూ రికార్డులు, ఖస్రా పహాణీల ప్రకారం ఈ భూమి ప్రభుత్వానికి చెందినదేనని స్పష్టమైందన్నారు. గతంలో క్రమబద్ధీకరణ ప్రతిపాదనలు తిరస్కరణకు గురైనప్పటికీ కొందరు వ్యవసాయం, ఫామ్‌హౌస్‌ల పేరుతో భూమిని వినియోగిస్తున్నట్లు గుర్తించి వారిని ఖాళీ చేయించి ప్రభుత్వ భూమిని రక్షించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని అధికారులు స్పష్టం చేశారు. విలువైన ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించే ప్రయత్నాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని, అవసరమైన చోట్ల ఫెన్సింగ్, సర్వేలు, చట్టపరమైన చర్యలు చేపడతామని వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల ఆధారంగా కూడా ఆక్రమణలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికారులు తెలిపారు.




# ప్రభుత్వ ఆస్పత్రులకు పెరుగుతున్న ఆదరణ

(మొదటి పేజీ తరువాయి)

సూపరింటెండెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేయడానికి వైద్యులు ఆసక్తి చూపుతున్నారని, ఇటీవల నిర్వహించిన వైద్యుల నియామకాల ద్వారా అది స్పష్టమైందని మంత్రి తెలిపారు. గత రెండున్నర సంవత్సరాల్లో సుమారు 14 వేల పోస్టులను భర్తీ చేశామని, వైద్యులు, నర్సులు, ప్రయోగశాల సాంకేతిక నిపుణులు, పారామెడికల్ సిబ్బంది తదితర విభాగాల్లో పెద్దఎత్తున నియామకాలు చేపట్టామని చెప్పారు. అవసరమైన చోట్ల నియామక ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు.

ప్రభుత్వం వైద్యరంగానికి అవసరమైన అన్ని వనరులను అందిస్తున్న నేపథ్యంలో సేవల నాణ్యతలో ఎలాంటి లోపాలకు సాకులు చెప్పవద్దని ఆస్పత్రుల సూపరింటెండెంట్లను మంత్రి హెచ్చరించారు. అద్దె భవనాలు, పాత భవనాల్లో కొనసాగుతున్న ఆస్పత్రులకు కొత్త భవనాలు నిర్మిస్తున్నామని, అవసరమైన మందులు, శస్త్రచికిత్స పరికరాలు, ఇతర వైద్య సామగ్రిని అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతి సూపరింటెండెంట్ తన ఆస్పత్రిని బాధ్యతగా నిర్వహించాలని, రోగి ఆస్పత్రిలో అడుగుపెట్టిన నాటి నుంచి డిశ్చార్జ్ అయ్యే వరకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా వ్యవస్థను రూపొందించాలని మంత్రి ఆదేశించారు. ప్రతిరోజూ వార్డులను స్వయంగా సందర్శించి రోగులతో మాట్లాడాలని, పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, భోజన నాణ్యత, భద్రత, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

వైద్యులు, నర్సులు, సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం, అనవసర గైర్హాజరు, రోగులను వేచి ఉంచడం, చికిత్సలో జాప్యం వంటి అంశాలను ఏమాత్రం సహించబోమని మంత్రి స్పష్టం చేశారు. అత్యవసర విభాగాలు, ఐసీయూలు, ప్రసూతి విభాగాలు, శస్త్రచికిత్స గదులు, డయాలసిస్ యూనిట్లు, ప్రయోగశాలలు, రక్తనిధులు, రేడియాలజీ సేవలు ఇరవై నాలుగు గంటలు సమర్థవంతంగా పనిచేసేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రాణాపాయ స్థితిలో వచ్చే రోగులకు ఆలస్యం లేకుండా చికిత్స ప్రారంభించాలని సూచించారు.

ఆస్పత్రుల పనితీరును ఇకపై డ్యాష్‌బోర్డు ద్వారా నిరంతరం సమీక్షిస్తామని మంత్రి వెల్లడించారు. బాహ్య, అంతర్గత రోగుల సేవలు, శస్త్రచికిత్సలు, అత్యవసర వైద్యం, మాతాశిశు ఆరోగ్య సేవలు, రోగుల సంతృప్తి, పరిశుభ్రత, సేవల నాణ్యత వంటి ప్రమాణాల ఆధారంగా పనితీరును అంచనా వేస్తామని చెప్పారు. ఉత్తమ సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బందిని ప్రోత్సహిస్తామని, నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, వైద్య మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ గౌరవ్ ఉప్పల్, వైద్య విద్య సంచాలకుడు నరేంద్ర కుమార్, ఆరోగ్యశ్రీ ప్రధాన కార్యనిర్వహణాధికారి హనుమంతు, ప్రజారోగ్య సంచాలకుడు రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం - 19 - జూలై 2026



# ఓటుతో నాయకుల ఎంపిక.. నారాయణలో ప్రజాస్వామ్య స్ఫూర్తి



- **వైభవంగా విద్యార్థి కేబినెట్ ఎన్నికలు..**
- **నూతన ప్రతినిధులతో ఘనంగా ప్రమాణ స్వీకారం.**

**సత్తుపల్లి, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావనను విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పెంపొందించాలనే లక్ష్యంతో సత్తుపల్లి పట్టణంలోని కాకర్లపల్లి రోడ్డులోని నారాయణ పాఠశాలలో శనివారం విద్యార్థి కేబినెట్ ఎన్నికలు, అనంతరం ప్రమాణ స్వీకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నిజమైన ఎన్నికల వాతావరణాన్ని తలపించేలా సాగిన ఈ ప్రక్రియలో విద్యార్థులు ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించి తమ నాయకులను ఎన్నుకున్నారు. ఎన్నికల్లో టీ. ననిత్ భార్గవ్ రామ్ హెడ్ బాయ్‌గా, ఎ. జస్విత హెడ్ గర్ల్‌గా, ఆర్. లీలేంద్ర డిప్యూటీ హెడ్ బాయ్‌గా, వి. ఆరాధ్య డిప్యూటీ హెడ్ గర్ల్‌గా, జస్విన్ జూనియర్ హెడ్ బాయ్‌గా, మోక్ష శ్రీ జూనియర్ హెడ్ గర్ల్‌గా ఎన్నికయ్యారు. అలాగే అగ్ని, నాగ్, పృథ్వీ, త్రిశూల్, కూశమంత్, తనుజ్, కార్తిక, కాలి హౌస్ కెప్టెన్లుగా విజయం సాధించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన విద్యార్థి ప్రతినిధులతో ఘనంగా ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఖమ్మం జోన్ ఏజీఎం రాంకీ ముఖ్య అతిథిగా హాజరై నూతన కేబినెట్ సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, బాధ్యతాయుత వైఖరి, ప్రజాస్వామ్య విలువలను అలవర్చుకోవడం భావి జీవితానికి బలమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న హైస్కూల్ ఆర్ అండ్ డి హెడ్ అనిల్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థి నాయకులు తమకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమ ప్రారంభంలో విద్యార్థిని లక్ష్మీ హంషిక ప్రదర్శించిన భరతనాట్య నృత్యం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. ఎన్నికల నిర్వహణలో విద్యార్థులు ప్రదర్శించిన క్రమశిక్షణ, చొరవ, తల్లిదండ్రుల భాగస్వామ్యం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు యనమల రామ్మూర్తి నూతనంగా ఎన్నికైన విద్యార్థి కేబినెట్ సభ్యులను అభినందిస్తూ, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ సతీష్, ఆర్ఐ క్రాంతి, ఆర్ఎస్‌టీఈ యశ్వంత్, హైస్కూల్ కోఆర్డినేటర్ ప్రవీణ్, ఈఛాంప్స్ కోఆర్డినేటర్ వినోద్, ఈకిడ్స్ కోఆర్డినేటర్ నీలిమ, అకడమిక్ డీన్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ రమ్య, ఏవో భరత్, పీఈటీ గోపిరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# విద్యార్థుల విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం అవసరం



- **ప్రధానోపాధ్యాయులు ఎస్. వరప్రసాదరావు**

**పెద్దమందడి,జూలై18(తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థుల విద్యాభివృద్ధి, క్రమశిక్షణ, ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని పెద్దమందడి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మద్దిగట్ల మోజర్ల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎస్. వరప్రసాదరావు అన్నారు.శనివారం పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అనేక సంక్షేమ సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత నోటు పుస్తకాలు, ఉచిత ఏకరూప దుస్తులు, పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, డిజిటల్ తరగతుల ద్వారా బోధన, విద్యార్థులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు తదితర సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించడంతో పాటు వారి చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఉపాధ్యాయులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ విద్యార్థుల విద్యా పురోగతిని తెలుసుకోవాలని, పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో ఉపాధ్యాయులు గద్వాల కృష్ణయ్య, శ్రీమతి వాణి ప్రభ, మధుసూదన్, ఎన్. వెంకటస్వామి, ఏ. వెంకటస్వామి, శ్రీనివాసులు, కృష్ణవేణి, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఓటరు పేరు తుది జాబితాలో ఉండేలా కృషి చేయాలి

- **బీఆర్ఎస్ శ్రేణులకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సూచన**



**పెద్దమందడి,జులై18(తెలంగాణ ముచ్చట్లు):-** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ప్రతి ఓటరు పేరు తుది జాబితాలో ఉండేలా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో పనిచేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సూచించారు. శనివారం పెద్దమందడి మండలంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన పరిశీలించి పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు.ఎస్ఐఆర్ కేంద్రాలను సందర్శించిన ఆయన, ఓటరు నమోదు, సవరణలు, అభ్యంతరాల స్వీకరణ తదితర ప్రక్రియను పరిశీలించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా తుది జాబితా నుంచి తొలగిపోకుండా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రతి గ్రామంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, ఓటు హక్కును కాపాడేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా, ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొంటూనే గ్రామాల్లో ప్రజా సమస్యలను గుర్తించి పార్టీ దృష్టికి తీసుకురావాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సేనాపతి, మండల నాయకుడు పురుషోత్తం రెడ్డి, మండల అధికార ప్రతినిధి సింగిరెడ్డి కురుమూర్తి, సూర శ్రీనివాసులు, గొల్ల మొగిలయ్య, కొత్త వెంకటన్న, కుడుకుంట్ల ఆంజనేయులు, నరసింహ, వెంకటయ్య రాజు, హనుమంతు, బాల్ రెడ్డి తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖమ్మం 108 సేవల జిల్లా అధికారికి ఘన వీడ్కోలు..

- **వనపర్తికి బదిలీపై వెళ్తున్న అవులూరి దుర్గాప్రసాద్‌కు ఉద్యోగుల సన్మానం..**
- **నూతన ఈఎంఈగా ఆలేటి ప్రణయ్ కుమార్ బాధ్యతల స్వీకారం.**



**సత్తుపల్లి, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లా అత్యవసర సేవల విభాగం 108 సర్వీస్ జిల్లా అధికారి (ఈఎంఈ)గా విధులు నిర్వహించిన అవులూరి దుర్గాప్రసాద్ వనపర్తి జిల్లాకు బదిలీ కావడంతో శనివారం ఆయనకు సత్తుపల్లిలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఖమ్మం జిల్లా 108 సిబ్బంది, 1962 పశుసంచార వాహన ఉద్యోగులు, 102 'అమ్మఒడి' వాహన సిబ్బంది, ఉచిత ఎఫ్‌హెచ్ఎస్ (ఫ్రీ హియర్స్ సర్వీస్) మార్చురీ వాహన సిబ్బంది కలిసి సన్మానించి సేవలను కొనియాడారు. ఖమ్మం జిల్లాలో ఎన్నో సంవత్సరాలుగా అత్యవసర వైద్య సేవలను సమర్థవంతంగా నిర్వహించి 108 సేవల నాణ్యతను మెరుగుపర్చడంలో అవులూరి దుర్గాప్రసాద్ విశేష కృషి చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయనకు మూడు జిల్లాల ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ నజీరుద్దీన్, ఖమ్మం జిల్లా 102 అమ్మఒడి అధికారి షేక్ ఇమామ్ పాషా, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల 108 అధికారులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా నూతన 108 జిల్లా అధికారి (ఈఎంఈ)గా ఆలేటి ప్రణయ్ కుమార్ బాధ్యతలు స్వీకరించినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో అత్యవసర వైద్య సాంకేతిక నిపుణులు (ఈఎంటీలు) తుమ్మా జగదీష్, గొల్లమందల కృష్ణ, ఎర్నం అప్పారావు, కొండ్రు రవి, చాట్ల శ్రీను, ఎంకి శ్రీను, భాస్కర్‌తో పాటు పైలెట్లు సయ్యద్ ఖాద్రి, సీతా రాంబాబు, శ్రావణ్, రవి, ఉప్పలయ్య, వంశీకృష్ణ, వీరబాబు, సలీం తదితరులు పాల్గొన్నారు.

# "వర్షాలు తక్కువ.. రైతులు మెట్ట పంటల వైపు దృష్టి సారించాలి"

- **శాస్త్రవేత్తల సూచనల ప్రకారం సాగు విధానాలు మార్చుకోవాలి**
- **కూసుమంచి మండల పర్యటనలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**
- **రూ.4.61 కోట్లతో ప్రగతి పనులకు శంకుస్థాపన.. చెక్కుల పంపిణీ**



**ఖమ్మం బ్యూరో, జులై 18(తెలంగాణ ముచ్చట్లు):**"ఎలినినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షాలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రైతాంగం సాంప్రదాయ సాగు మొండిపట్టు వీడి, మారుతున్న ప్రకృతి సవాళ్లకు అనుగుణంగా అప్రమత్తం కావాలి. అధిక నీటి వినియోగం ఉండే పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ నీటి అవసరాలతో చేతికొచ్చే ప్రత్యామ్నాయ మెట్ట పంటల వైపే దృష్టి సారించాలి" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. శనివారం పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో మంత్రి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాలను ఉద్దేశించి మంత్రి పొంగులేటి మాట్లాడుతూ..ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షపాతి అని, ఇప్పటికే 'రైతు భరోసా' అందించి అన్నదాతలకు అండగా నిలిచామని స్పష్టం చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ సాగు విధానాల్లో మార్పులు చేసుకోవడం అత్యంత ఆవశ్యకమని ఆయన పేర్కొన్నారు.

రూ.4.61 కోట్లతో ప్రగతి బాట..

మండల పర్యటనలో భాగంగా మంత్రి పొంగులేటి పలు చోట్ల శంకుస్థాపనలు చేశారు. మల్లాయిగూడెంలో రూ. 2.52 కోట్లతో పెరికసింగారం ఎన్ఎస్పీ కెనాల్ నుంచి భగవాన్ తండా మీదుగా మల్లాయిగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, రూ. 20 లక్షలతో నిర్మించే గ్రామ పంచాయతీ కార్యాలయ భవనానికి భూమిపూజ చేశారు. అనంతరం కోక్యా తండాలో రూ. 1.69 కోట్లతో లింగారం తండా నుంచి లోక్యా తండా ఎన్ఎస్పీ కాలువ వరకు నిర్మించే బీటీ రోడ్డు పనులకు, అగ్రహారంలో రూ. 20 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి శంకుస్థాపనలు చేశారు.

సంక్షేమ హస్తం.. లబ్ధిదారులకు ఆసరా

కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా సంక్షేమ చెక్కుల పంపిణీ జరిగింది. మండల వ్యాప్తంగా 66 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగా వివిధ అనారోగ్య కారణాలతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న 111 మంది బాధితులకు రూ. 35.16 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# పాలేరు ప్రగతి పనుల్లో వేగం పెంచండి

- **నాణ్యతలో రాజీ పడితే సహించేది లేదు**
- **గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి**
- **'ప్రజా దర్బార్' దరఖాస్తులను వెంటనే పరిష్కరించండి**
- **ఉన్నత స్థాయి సమీక్షలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం**



**ఖమ్మం బ్యూరో, జులై 18(తెలంగాణ ముచ్చట్లు ):**పాలేరు నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని, ప్రజలకు వీటి ఫలాలు త్వరితగతిన అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. శనివారం కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధి పురోగతిపై ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌లతో కలిసి మంత్రి వివిధ శాఖల అధికారులతో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంజినీరింగ్ శాఖల వారీగా ఇప్పటివరకు మంజూరైన పనులు, టెండర్ల ప్రక్రియ, ప్రస్తుతం క్షేత్రస్థాయిలో సాగుతున్న పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక కారణాల వల్ల నిలిచిపోయిన టెండర్ల అడ్డంకులను వెంటనే తొలగించాలని ఆదేశించారు.

గడువు దాటితే కుదరదు..

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా పనులన్నింటినీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, పెండింగ్ బిల్లుల వివరాలను వెంటనే సమర్పించాలని సూచించారు.

శాఖల మధ్య సమన్వయం ముఖ్యం

అభివృద్ధి పనులు వేగంగా సాగాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం చాలా ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. అధికారులు ఒకరితో ఒకరు చర్చించుకుంటూ ముందుకెళ్లాలని, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. 'ప్రజా దర్బార్' వేదికగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని, వీటికి అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా పూర్తిస్థాయిలో భూముల రీసర్వే ప్రక్రియకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. పాలేరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మంత్రి ఆకాంక్షించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఆర్డీవో ఎన్.శ్రీనివాస్, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసచారి, నియోజకవర్గ పరిధిలోని ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఆదివారం - 19 - జూలై 2026

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

## డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసుల్లో వాహనదారులకు జరిమానా విధించిన న్యాయమూర్తి

- **ప్రాసిక్యూషన్ కు సహకరించిన అధికారులను అభినందించిన పోలీస్ కమిషనర్**

**ఖమ్మం బ్యూరో, జులై 18(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు చేసిన 46 డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులలోని వాహనదారులకు ఒక్కొరికి 10 వేల రూపాయల చొప్పున నాలుగు లక్షల అరవై వేల రూపాయల జరిమానా విధిస్తూ స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి బి. నాగలక్ష్మి తీర్పు చెప్పారు. ఈ సందర్భంగా ఖమ్మం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బెల్లం సత్యనారాయణ మాట్లాడుతూ... మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టం సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రజలు తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా దృష్టిలో ఉంచుకొని మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించి, సురక్షితమైన రహదారి ప్రయాణానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రాసిక్యూషన్ కు సహకరించిన అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

## సర్ ప్రక్రియతో పాటు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి



- **మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**

**పెద్దమందడి,జూలై18(తెలంగాణ ముచ్చట్లు):** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పాల్గొంటూనే ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకురావాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి బి.ఆర్.ఎస్ శ్రేణులకు సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆయన శనివారం పెద్దమందడి మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు.చిలుకటోనీపల్లి, బలీదుపల్లి, వెల్టూర్ మదిగట్ల, మోజర్ల, చిన్నమందడి, పెద్దమందడి, జగత్‌పల్లి గ్రామాల్లో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా బి.ఆర్.ఎస్ నాయకులు, కార్యకర్తలు, బి.ఎల్.ఓలు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి ఓటరు పేరు తుది ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.అదే సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతిరోజూ ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొంటూనే గ్రామాల్లో ప్రజల సమస్యలను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు.ఈ పర్యటనలో వాకిటి శ్రీధర్, జగదీశ్వర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, వేణు యాదవ్, కుమార్ యాదవ్, అశోక్, సేనాపతి, పురుషోత్తం రెడ్డి, కురుమూర్తి, శ్రీనివాసులు, మొగిలయ్య, వెంకటన్న, ఆంజనేయులు, నరసింహ, హనుమంత్, బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధిపేట్ జిల్లా బీజేపీ కార్యదర్శిగా పృథ్విరాజ్ గౌడ్ నియామకం

- **కష్టపడి ఎదిగిన కార్యకర్తకు పార్టీ గుర్తింపు**



**భీమదేవరపల్లి, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):** భారతీయ జనతా పార్టీ సిద్ధిపేట్ జిల్లా కార్యదర్శిగా పైడిపెల్లి పృథ్విరాజ్ గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, సిద్ధిపేట్ జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్, కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, బోయినిపెల్లి ప్రవీణ్ రావు, గుర్రాల లక్ష్మారెడ్డి తదితర నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థి దశలోనే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ABVP)లో చేరి విద్యార్థి సమస్యలపై ఉద్యమాలు చేపట్టిన పృథ్విరాజ్ గౌడ్, 2009లో భారతీయ జనతా పార్టీలో చేరారు. గ్రామ స్థాయి కార్యకర్తగా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం, నేడు సిద్ధిపేట్ జిల్లా కార్యదర్శి బాధ్యతల వరకు చేరుకోవడం ఆయన అంకితభావం, క్రమశిక్షణ, నిరంతర శ్రమకు నిదర్శనంగా నిలిచింది.

పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ క్రియాశీల నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీని కలిసిన సందర్భాన్ని తన రాజకీయ జీవితంలో మరపురాని ఘట్టంగా అభివర్ణించారు.

పార్టీలో నిర్వహించిన బాధ్యతలు

2009-2014: బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షులు (2 పర్యాయాలు)

2014-2015: ఉమ్మడి కరీంనగర్ జిల్లా యువమోర్చా కార్యదర్శి

2015-2019: మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి (2 పర్యాయాలు)

2019-2020: హనుమకొండ జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షులు

2020-2025: భీమదేవరపల్లి మండల బీజేపీ అధ్యక్షులు (2 పర్యాయాలు)

2025-2026: బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు

2026 నుంచి: బీజేపీ సిద్ధిపేట్ జిల్లా కార్యదర్శి

భీమదేవరపల్లి మండలంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక ధర్నాలు, నిరసనలు, సేవా కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా గుర్తింపు పొందారు.

ఈ సందర్భంగా పైడిపెల్లి పృథ్విరాజ్ గౌడ్ మాట్లాడుతూ, "ప్రజల సమస్యలే నా అజెండా - సేవే నా లక్ష్యం. నాపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు. పార్టీ బలోపేతం, ప్రజా సేవ కోసం మరింత అంకితభావంతో పనిచేస్తాను" అని తెలిపారు.

# పల్లె జనాల గుండె చప్పుడై.. పచ్చని పొలాల గూటికి చేరిన పొంగులేటి!





**ఖమ్మం బ్యూరో, జులై 18(తెలంగాణ ముచ్చట్లు ):** పచ్చని చేలల్లో వరి నాట్లు వేస్తూ.. పల్లె ప్రగతికి ప్రాణం పోస్తున్న శ్రమజీవుల చెంతకు పాలేరు ఆత్మీయ బంధువు కదిలివచ్చారు. కూసుమంచి మండల పర్యటనలో భాగంగా మల్లాయిగూడెం ముగించుకుని మార్గమధ్యంలోని లింగారం తండా, జుజ్జులరావ్ పేట గ్రామ శివార్ల మీదుగా కోక్యా తండాకు వెళ్తున్న క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. అక్కడ శ్రమిస్తున్న మహిళా కూలీలను చూసి తన కాన్వాయ్‌ను ఆపి వాహనం దిగారు. హోదాల సరిహద్దులు వీడి, నిరాడంబరంగా నేరుగా ఆ పల్లె పడతుల వద్దకు వెళ్లి వారి కష్టసుఖాలను, అవసరాలను ఎంతో ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి పేద వారికి రాజకీయం లేని 'ఇందిరమ్మ ఇళ్ల' వెలుగులు అందిస్తామని, ఉచిత కరెంట్, సంక్షేమ పథకాల తోడుంటామని ఆయన ఇచ్చిన భరోసా, ఆ పల్లె జనాల ముఖాల్లో కొండంత ఆనందాన్ని, కొత్త నమ్మకాన్ని నింపింది.

# భయాన్ని వీడండి.. భరోసాతో ముందుకు సాగండి..!







- **ప్రజల్లో చైతన్యం నింపిన వైద్యశాఖ**

**జమ్మికుంట టౌన్ జులై 18 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంట 13, 14వ వార్డుల్లో ఇటీవల యాదృచ్ఛికంగా చోటుచేసుకున్న మరణాల నేపథ్యంలో చేతబడి, బాణామతి వంటి మూఢనమ్మకాలు వ్యాపించడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో శనివారం విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యశాఖ బృందం ఆబాది జమ్మికుంట 13, 14వ వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ చేతబడి, బాణామతి వంటి మూఢనమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించింది. అనంతరం నిర్వహించిన చైతన్య ర్యాలీలో పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రభుదాస్ మాట్లాడుతూ, "మూఢనమ్మకం మనిషిని మూర్ఖుడిగా మారుస్తుంది.. మనిషిని మనిషిలా జీవించనివ్వదు. చేతబడి, బాణామతి వంటి వాటిని నమ్మకుండా శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలి. ఎవరైనా అనారోగ్యానికి గురైతే మూఢనమ్మకాల జోలికి వెళ్లకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రి లేదా వైద్య సిబ్బందిని సంప్రదించాలి" అని సూచించారు. సమాజ అభివృద్ధికి ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనా విధానం పెంపొందడం అత్యంత అవసరమని ఆయన అన్నారు. అదే సమయంలో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వార్డులో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. చిన్నపాటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేసి, అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఎగిత సుజాత అశోక్, మైస శిరీష రవి, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ కార్తీక్, డాక్టర్ మహోన్నత్ పటేల్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, సూపర్వైజర్ సదానందం, ఏఎన్ఎంలు సరళ, మంజుల, రాధ, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఆశా కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట.. కోరపల్లిలో నిపుణుల ఉచిత వైద్య శిబిరం





**జమ్మికుంట టౌన్, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని కోరపల్లి గ్రామంలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, ఆదిత్య-అమృత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి గ్రామ ప్రజలు విశేష స్పందన కనబరిచి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ భరత్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మహిపాల్, డాక్టర్ గ్రీష్మ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి కనీసం ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స పొందవచ్చని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆధునిక జీవనశైలి, మానసిక ఒత్తిడి కారణంగా గుండె జబ్బులు, క్యాన్సర్, బ్రెయిన్ స్ట్రోక్ వంటి ప్రాణాంతక వ్యాధులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొనే ప్రజలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. శిబిరంలో గ్రామ ప్రజలకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందికట్ల మధుసూదన్, ఉపసర్పంచ్ బక్కతట్ల రాజు, వార్డు సభ్యులు, గ్రామ పాలకవర్గ సభ్యులు, బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన, కోఆర్డినేటర్ ఆసియా, ఆదిత్య-అమృత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, పీఆర్‌వోలు రఫిక్, దుర్గాప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది అనిల్ రావు, మహేష్, శ్రావణ్, రంజిత్, పూజ, సుచిత్ర, శిల్ప, శృతి, రమేష్, సత్యనారాయణతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# స్వరాంజలి పాటల పోటీలతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సందడి

- **సిటిజన్ న్యూస్ ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రతిభకు వేదిక**




**వనపర్తి,జూలై18(తెలంగాణ ముచ్చట్లు):** సిటిజన్ న్యూస్ ఆధ్వర్యంలో వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన 'స్వరాంజలి' సినీ మధుర గీతాల పోటీలు విద్యార్థుల ఉత్సాహభరిత భాగస్వామ్యంతో ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ రఘునందన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సిటిజన్ న్యూస్ అధినేత డి. రవిప్రసాద్ నిర్వాహకులుగా వ్యవహరించారు.ఈ సందర్భంగా డి. రవిప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ చదువుతో పాటు తమ కళా ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. అలాంటి ప్రయత్నాల ద్వారానే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని పేర్కొన్నారు.మొదటి విడతలో జిల్లాలోని ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహిస్తున్నామని, రెండో విడతలో 8వ, 9వ, 10వ తరగతి విద్యార్థులకు కూడా ఇదే తరహా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా సినీ గీతాలను ఆలపించారు. వేదికపై ధైర్యంగా ముందుకు వచ్చి తమ ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ రఘునందన్ అభినందిస్తూ, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు.కార్యక్రమానికి ఏదుల ఎంఈఓ డి. ప్రభాకర్ న్యాయనిర్ణేతగా వ్యవహరించగా, వైస్ ప్రిన్సిపాల్ ఉమా, లెక్చరర్ రంజిత్, ప్రజానాట్యమండలి సభ్యులు నందిమల్ల రాములు, గాయకులు సాంబయ్య, గంధం రవి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణకు సహకరించాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు



**పెద్దమందడి,జూలై18(తెలంగాణ ముచ్చట్లు):** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి ప్రజలందరూ పూర్తి సహకారం అందించాలని ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా శనివారం తన కుటుంబ సభ్యులకు సంబంధించిన ఓటరు నమోదు, సవరణ ఫారాలను ఆర్ఐ శంకర్, బీఎల్ఓ కృష్ణవేణికి సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ద్వారా ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటరు జాబితాల రూపకల్పనకు అవకాశం కలుగుతుందన్నారు. ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకుని, అవసరమైతే నమోదు, మార్పులు, సవరణల కోసం సంబంధిత ఫారాలను బీఎల్ఓలకు సమర్పించాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తున్నారని, మరణించినవారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, ద్వంద్వ నమోదులు ఉన్న వారి పేర్లను తొలగించడంతో పాటు 18 సంవత్సరాలు నిండిన యువతను కొత్త ఓటర్లుగా నమోదు చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.ప్రజలందరూ ఈ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని, అర్హులైన ప్రతి ఓటరు పేరు తుది జాబితాలో ఉండేలా బాధ్యతతో వ్యవహరించాలని చెన్నకేశవులు విజ్ఞప్తి చేశారు.

# సీడ్ ప్లాంట్ల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి

- రైతుల బకాయిలు వెంటనే చెల్లించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు




**హుజురాబాద్,జులై 18(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా రైతాంగాన్ని ఆర్థికంగా దోపిడీ చేస్తున్న సీడ్ ప్లాంట్ల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, రైతులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం హుజూరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో కామ్రేడ్ కే. చంద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.హుజూరాబాద్ నియోజకవర్గంలో రైతులు పెద్ద ఎత్తున వరి విత్తనాలు ఉత్పత్తి చేసి సీడ్ ప్లాంట్లకు విక్రయిస్తున్నారని, యాసంగి సీజన్‌కు ముందే ధరలు నిర్ణయించి రైతులతో ఒప్పందాలు కుదుర్చుకున్న సీడ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్, పంట చేతికి వచ్చిన తర్వాత ఆ ఒప్పందాలను ఉల్లంఘించి రైతులను మోసం చేస్తోందని ఆరోపించారు. 2025లో కుదుర్చుకున్న ఒప్పందాలను పక్కనపెట్టి, 2026లో కొత్త ఒప్పందాల పేరుతో ధరలు తగ్గించి రైతులను తీవ్రంగా నష్టపరిచారని విమర్శించారు.

తరుగు, తూకం పేరుతో ప్రతి ఏడాది రైతుల నుంచి కోట్ల రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్న సీడ్ ప్లాంట్ల యజమానులపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఒప్పందం ప్రకారం డబ్బులు చెల్లించాలని రైతులు అడిగితే అవమానిస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని రైతులకు న్యాయం చేయాలని, లేకపోతే సీపీఎం ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

అదే సమావేశంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన పేదలకు వెంటనే పంపిణీ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల్లో ఖాళీలను భర్తీ చేసి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్య, వైద్య రంగాల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, రైతులకు యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని కోరారు.వ్యవసాయ శాఖ గతంలో ప్రకటించిన 33 రకాల వరి వంగడాలకు బోనస్‌ను యథావిధిగా కొనసాగించాలని, వ్యవసాయానికి నాణ్యమైన 24 గంటల విద్యుత్ సరఫరా అందించాలని డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆగస్టు చివరి వరకు గ్రామాల్లో సభలు, సమావేశాలు, చర్చాగోష్టులు నిర్వహిస్తామని తెలిపారు.

సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కొప్పుల శంకర్, మండల కమిటీ సభ్యులు ప్రతాప్ శ్రీనివాస్, కొంకటి చంద్రయ్య, ఇమ్మడి దేవేందర్, అజ్జు, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.



# సర్ ప్రక్రియపై కాంగ్రెస్ ఫుల్ ఫోకస్.. క్షేత్రస్థాయిలో కోమటిరెడ్డి–ప్రణవ్ సమీక్ష


**జమ్మికుంట, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):** ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో కార్యక్రమాల అమలును పరిశీలించేందుకు కరీంనగర్ సుడా ఛైర్మన్, హుజురాబాద్ సర్ ఇంచార్జి కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ శనివారం జమ్మికుంట మండలంలోని వావిలాల, సైదాబాద్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు ఓటర్లతో మాట్లాడిన వారు, ఓటరు నమోదు, సవరణ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే వెంటనే బీఎల్ఏలు లేదా బీఎల్వో అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకుని ప్రతి ఓటరును మ్యాపింగ్ చేయాలని, పార్టీ నియమించిన బీఎల్ఏలు, కోఆర్డినేటర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, సర్ కోఆర్డినేటర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ గీతానికి ప్రాణం పోసిన అందె శ్రీకి అక్షరాంజలి


- హుజూరాబాద్‌లో ఘనంగా నిర్వహించిన అందె శ్రీ 65వ జయంతి వేడుకలు






**హుజూరాబాద్, జూలై 18(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ రాష్ట్ర గీతం "జయ జయహే తెలంగాణ" రచయిత, ప్రజాకవి డా. అందె శ్రీ 65వ జయంతి సందర్భంగా హుజూరాబాద్ పట్టణంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, సాహితీవేత్తలు, ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు అందె శ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.వక్తలు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అందె శ్రీ రచనలు ప్రజల్లో చైతన్యాన్ని నింపాయని, ఆయన కలం తెలంగాణ ఆత్మను ప్రపంచానికి పరిచయం చేసిందని కొనియాడారు. రాష్ట్ర గీతంగా గుర్తింపు పొందిన "జయ జయహే తెలంగాణ" గీతం ప్రతి తెలంగాణ వాసిలో గర్వాన్ని నింపుతుందని పేర్కొన్నారు.తెలంగాణ భాష, సంస్కృతి, పల్లె జీవనాన్ని తన రచనల ద్వారా చిరస్థాయిగా నిలిపిన మహాకవి అందె శ్రీ సాహిత్య సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ తెలంగాణ భాష, సంస్కృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం అందె శ్రీ జయంతి సందర్భంగా మిఠాయిలు పంచుకొని ఆయనకు ఘనంగా అక్షరాంజలి ఘటించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కవులు, రచయితలు, యువజన సంఘాల ప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న బోనకల్ ఎంపీడీఓ సిబ్బంది



**ఖమ్మం బ్యూరో,జూలై 18(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం జిల్లా బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన ప్రముఖ బాల్ బ్యాడ్మింటన్ కోచ్ లింగయ్య కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. క్రీడారంగంలో విశేష సేవలందిస్తూ అనేక మంది యువతను ప్రతిభావంతులైన క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ఆయనకు కష్టకాలంలో అండగా నిలిచేందుకు బోనకల్ మండల పరిషత్ పూర్వ, ప్రస్తుత సిబ్బంది, పూర్వ ఎంపీడీఓలు, పూర్వ పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్ అలీ, అలీ ఫ్రెండ్స్ మరియు బంధువులు ముందుకొచ్చారు. లింగయ్య వైద్య చికిత్సకు తోడ్పాటుగా తమ వంతు ఆర్థిక సహాయాన్ని సేకరించి, బోనకల్ ఎంపీడీఓ రూరవత్ రమాదేవి చేతుల మీదుగా 15200రూపాయలు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కోచ్ లింగయ్య త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని మళ్లీ క్రీడా మైదానంలోకి వచ్చి యువ క్రీడాకారులకు మార్గదర్శకత్వం వహించాలని ఆకాంక్షించారు. సమాజానికి సేవ చేసిన వ్యక్తుల పట్ల మానవత్వంతో స్పందించి, అవసర సమయంలో అండగా నిలవడం ఆదర్శప్రాయమని పలువురు అభిప్రాయపడ్డారు. బోనకల్ మండల సిబ్బంది చేసిన ఈ సహాయం సేవాభావానికి నిదర్శనంగా నిలిచిందని స్థానికులు ప్రశంసించారు.




# ఓటు విలువను నేర్పిన శస్త్ర పబ్లిక్ స్కూల్

- ప్రజాస్వామ్య విలువలపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన




**హుజూరాబాద్, జూలై 18(తెలంగాణ ముచ్చట్లు ):** హుజూరాబాద్ పట్టణంలోని శస్త్ర పబ్లిక్ స్కూల్‌లో శనివారం హౌస్ ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించారు. కరస్పాండెంట్ వేణుమాధవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో సీవీ రామన్, ఆర్యభట్ట, రామానుజన్, చాణక్య హౌస్‌లకు చెందిన విద్యార్థులు బ్యాలెట్ బాక్స్‌లో ఓటు వేసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రతి హౌస్‌కు చెందిన సుమారు 45 మంది విద్యార్థులు ఎన్నికల్లో పాల్గొని ప్రజాస్వామ్య ప్రక్రియను ప్రత్యక్షంగా అనుభవించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ వేణుమాధవ్ మాట్లాడుతూ, విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యం, ఎన్నికల విధానం, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. చిన్నప్పటి నుంచే ప్రజాస్వామ్య స్ఫూర్తి, బాధ్యతాయుతమైన పౌరసత్వ భావన పెంపొందేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు.

కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ముంజాల సంగీత, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలైన పెసలు, మినుములు, కందులు, జొన్నలు పై రైతులు దృష్టి సాధించాలి..

- గ్రామాల్లో రైతులకు పంటలపై ఎల్ నినో ప్రభావంపై అవగాహన..
- మండల వ్యవసాయ శాఖ అధికారి మయాన్ మంజుఖాన్



**ఖమ్మం బ్యూరో, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు ):** వైరా మండలంలోని గండగల పాడు, అష్టగుర్తి గ్రామాల్లో సందర్శించి రైతులకు పంటలపై ఎల్ నినో ప్రభావంపై అవగాహన మండల వ్యవసాయ శాఖ అధికారి మయాన్ మంజుఖాన్ కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మంజు ఖాన్ మాట్లాడుతూ..రైతులు ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా వానాకాలం సీజన్లో స్వల్పకాలిక తక్కువ నీటితో అధిక దిగుబడును ఇచ్చే పంట రకాలను ఎంచుకోవాలని సూచించారు.అలానే ప్రత్యామ్నాయ పంటలైన పెసలు, మినుములు, కందులు, జొన్నలు మరియు ఇతర చిరుధాన్యాల పంటలు పండించాలని కోరారు. ఈ సంవత్సరం భూగర్భ జలాలు అడుగంటి పోవడం జరుగుతుంది కాబట్టి ముందస్తు ప్రణాళికలో భాగంగా వరి మరియు మిర్చికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పంటలను వేయాలని వివరించారు. మండలంలో జూలైలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అవుతున్న నేపథ్యంలో భూగర్భ జలమట్టం తగ్గుతుందని భూగర్భ జలాలు పెంచేలా రైతులు ఫార్మ్ పాండ్స్ (పంట కుంటలు) ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం విబిజీ రామ్ జీ పథకం ద్వారా 100% రాయితీపై అందిస్తుందని,ఈ ఫార్మ్ పాండ్స్(పంట కుంటలు) పథకాన్ని రైతులందరూ అధిక మొత్తంలో వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ లు వెంపటి కీర్తి, మేడా రాజేష్, అష్టపర్తి సర్పంచ్ కంచర్ల అనిత, కంచర్ల వెంకటేశ్వరరావు, గుమ్మ స్వరూప, కంచర్ల నాగేశ్వరరావు, గండగల పాడు గ్రామం రైతులు ఇమ్మడి వీరభద్రం, మల్లేపాటి రామారావు, చిత్తూరు మురళి, ఇమ్మడి సుధీర్, కామినేని రవి, వివిధ గ్రామాలు రైతులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# గంగారంలో ఘనంగా హీరో జై కృష్ణ జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసిన అభిమానులు.

**సత్తుపల్లి, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):** సూపర్ స్టార్ కృష్ణ మనుమడు, యువ సినీ నటుడు జై కృష్ణ జన్మదిన వేడుకలను సత్తుపల్లి మండలంలోని గంగారం రింగ్ సెంటర్‌లో అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ స్టార్ కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు కేక్ కట్ చేసి జై కృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేస్తూ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. జై కృష్ణ సినీ జీవితంలో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాగులవంచ వెంకటేశ్వరరావు, చల్లారి సత్యనారాయణ, శ్రీరామ వెంకటేశ్వరరావు, పార్సపు భాను తదితర అభిమానులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.





# రూ.3.14 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం.!

- అశ్వరావుపేటలో ఎంపీ రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ విస్తృత పర్యటన.
- సీసీ రోడ్లు, బోర్‌వెల్లు, వీఓ భవనాల ప్రారంభం.
- కొత్త పనులకు శంకుస్థాపనలు.

**అశ్వరావుపేట, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):** అశ్వరావుపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి శనివారం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించిన ఆయన రూ.3.14 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించి, కొత్త పనులకు శంకుస్థాపనలు చేశారు. ఆశన్నగూడెం నుంచి ప్రారంభమైన పర్యటన అల్లిగూడెం, ఊట్లపల్లి, మల్లాయగూడెం, అనంతారం, గాండ్లగూడెం, జెట్టివారిగూడెం, కొత్తూరు, మామిళ్లవారిగూడెం, పాకలగూడెం, అసుపాక గ్రామాల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రజలకు అంకితం చేశారు. గుమ్మడివల్లిలో మహిళా స్వయం సహాయక సంఘాల కోసం నిర్మించిన వీఓ భవనాన్ని, సీసీ రోడ్డును ప్రారంభించారు. అసుపాకలో తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోర్‌వెల్‌ను ప్రారంభించారు. అశ్వరావుపేటలో నిర్మాణంలో ఉన్న కొమరం భీమ్ ఇకోపార్క్ పనులను పరిశీలించి, నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రమణక్కపేటలో సీసీ రోడ్ల నిర్మాణానికి, తోగ్గూడెంలో బోర్‌వెల్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. అనంతరం గ్రామాల్లో ప్రజలతో మమేకమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధిలో ఎలాంటి రాజీ ఉండదని, అధికారులు ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ, ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించి సమగ్ర అభివృద్ధి సాధించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్‌బాబు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిన్నశెట్టి సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యుడు తుమ్మా రాంబాబు, ఎమ్మార్వో కోల లక్ష్మీనారాయణ, ఎంపీవో రామకోటిరెడ్డి, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణను పారదర్శకంగా పూర్తి చేయాలి

- ఐదు జిల్లాల పురోగతిపై రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ హరి చందన దాసరి సమీక్ష

**హనుమకొండ, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ-2026 కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ హరి చందన దాసరి అధికారులను ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతిని జిల్లా వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేషన్, ఇంటింటి సర్వే, ఫారాల పంపిణీ, స్వీకరణ, డిజిటలైజేషన్, అర్హులైన ఓటర్ల నమోదు, అనర్హుల వివరాల పరిశీలన, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వంటి అంశాలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో నమోదయ్యేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని, ఎన్నికల సంఘం నిర్దేశించిన కాలపట్టికను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, దరఖాస్తుల సమర్పణ విధానం, అవసరమైన పత్రాలు, తరచుగా అడిగే ప్రశ్నలపై ప్రచారం నిర్వహించాలని తెలిపారు. నివాసం మారిన వారు, వలస వెళ్లిన వారు, వివరాల్లో మార్పులు చేయించుకోవాల్సిన వారు స్వచ్ఛందంగా నమోదు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారుల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, మీడియాతో సమన్వయం కొనసాగించాలని, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఫిర్యాదులు, అభ్యంతరాలను సకాలంలో పరిష్కరించి ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాల కలెక్టర్లు తమ తమ జిల్లాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. హనుమకొండ జిల్లాలో 100 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేసి 68.13 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. వరంగల్ జిల్లాలో 71 శాతం, మహబూబాబాద్ జిల్లాలో 74 శాతం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 71.74 శాతం, ములుగు జిల్లాలో 75.60 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని ఆయా జిల్లాల అధికారులు వెల్లడించారు. ఈ సమావేశంలో ఐదు జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, ఎన్నికల విభాగ సిబ్బంది పాల్గొన్నారు.





# ఫాదర్ కొలంబో పాఠశాలలో ఘనంగా ఇన్వెస్టిచర్ వేడుక

**స్టేషన్ ఘన్‌పూర్, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘన్‌పూర్‌లోని ఫాదర్ కొలంబో పాఠశాలలో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావన, సేవా దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో శనివారం ఇన్వెస్టిచర్ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టేషన్ ఘన్‌పూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేణు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నాయకత్వం, క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే బాధ్యతతో పాటు విలువలను పాటించాలని సూచించారు. గౌరవ అతిథిగా రెవ. ఫా. బాలరాజు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, కరస్పాండెంట్ రెవ. ఫా. థామస్ కిరణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమం ప్రార్థనా గీతంతో ప్రారంభమైంది. అనంతరం జ్యోతి ప్రజ్వలన నిర్వహించి, నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు, శాష్‌లు ధరింపజేసి బాధ్యతలను అప్పగించారు. విద్యార్థి నాయకులు విధేయత ప్రమాణం చేసి తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించి, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దే దిశగా ఈ ఇన్వెస్టిచర్ వేడుక స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

# ఎస్ఐఆర్ విజయవంతానికి రాజకీయ పార్టీల సహకారం కీలకం

**హనుమకొండ, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) 2026 కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడంలో రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ హరి చందన దాసరి సూచించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఐదు జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఎస్ఐఆర్ కార్యక్రమ పురోగతిపై సమీక్ష నిర్వహించారు.



ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి సూచనలు, సందేహాలను తెలుసుకుని ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం వివరణ ఇచ్చారు. ఎస్ఐఆర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంలో రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్లు కీలక పాత్ర పోషించాలని, అపోహలను తొలగిస్తూ ఎన్నికల సంఘం నిబంధనలను ప్రజలకు వివరించాలని సూచించారు.
బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లకు నిరంతర శిక్షణ అందించడంతో పాటు వారి పనితీరును పర్యవేక్షించాలని, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి అర్హుడైన ఓటరు నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.
టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి పట్టణ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ పురోగతిని మరింత వేగవంతం చేయాలని, ప్రతి బీఎల్‌వో ఇంటింటికీ వెళ్లి ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.
వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో డిజిటలైజేషన్ పురోగతిని మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి సెలవు దినాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి లక్ష్యాన్ని త్వరగా సాధించాలని సూచించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ బీఎల్‌ఏల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎన్నికల సంఘం చేపడుతున్న కార్యక్రమానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.
ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం, సీపీఐ, సీపీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



# జిల్లా రవాణా శాఖ అధికారి బి. శంకర్ నాయక్ ను కలిసిన ఖమ్మం జిల్లా జర్నలిస్టులు

**ఖమ్మం బ్యూరో, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు ):** మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు బాదావత్ శంకర్ నాయక్ స్వీకరించారు.
ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా బ్యూరో లు దేవబత్తిని సీతారాములు, వేము విజయ్, రిపోర్టర్ నాగబత్తిని క్రాంతి కుమార్ రవాణా శాఖ కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ ఈ సందర్భంగా జర్నలిస్టు మిత్రులతో తెలుసుకొని ముచ్చడించారు.
ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు ఎస్.కె కాసిం సాహెబ్, ఎస్ వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన హరి చందన

- ప్రతి అర్హుడైన ఓటరును జాబితాలో చేర్చేలా బీఎల్‌వోలు పనిచేయాలని సూచన





**హనుమకొండ, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) 2026 కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ హరి చందన దాసరి శనివారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి పరిశీలించారు. హనుమకొండ పట్టణంలోని బాలసముద్రం శ్రీనివాస్ కాలనీ, హంటర్ రోడ్డులోని దీన్ దయాళ్ నగర్ ప్రాంతాల్లో పర్యటించిన ఆమె బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. హెల్ప్‌డెస్క్‌ల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, నమోదు, డిజిటలైజేషన్ పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.
బీఎల్‌వోలతో మాట్లాడిన హరి చందన దాసరి ఇంటింటి సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని, గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, తొలగింపునకు ప్రతిపాదించిన ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పూర్తిగా ధ్రువీకరించిన అనంతరమే నమోదు చేయాలని సూచించారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారం అందించాలని, ఫారాలు సక్రమంగా నింపేందుకు ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని, సేకరించిన ఫారాలను ఆలస్యం చేయకుండా వెంటనే డిజిటలైజేషన్ చేసి ఎన్నికల సంఘం నిర్దేశించిన కాలపట్టిక ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల వివరాల నమోదు, మార్పులు, తొలగింపుల విషయంలో పూర్తి పారదర్శకత పాటించాలని, హెల్ప్‌డెస్క్‌ల ద్వారా ప్రజలకు అవసరమైన సహాయం అందిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పర్యటనలో ఆర్డీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎన్నికల పర్యవేక్షకుడు జగత్ సింగ్, బూత్ స్థాయి అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం - 19 - జూలై 2026


## ఉచిత సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ కోచింగ్‌కు దరఖాస్తుల గడువు నేడు ముగింపు

- **అర్హులైన అభ్యర్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి**
- **డా. కె. జగన్ మోహన్**

**హనుమకొండ, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లోని తెలంగాణ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ-2027 రెసిడెన్షియల్ కోచింగ్‌కు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు జూలై 19 చివరి తేదీ అని ఉమ్మడి వరంగల్ జిల్లా షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా. కె. జగన్ మోహన్ తెలిపారు.తెలంగాణకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ వర్గాలకు చెందిన డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువు ముగిసే లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు జూలై 26న ఉదయం 11 గంటలకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.దరఖాస్తు విధానం, అర్హతలు, ఇతర వివరాల కోసం తెలంగాణ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని డా. జగన్ మోహన్ కోరారు.




## చరిత్రను తెలుసుకోవడం, వారసత్వ సంపదను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత

- **ఎంపి డాక్టర్ కడియం కావ్య**
- **'హెరిటేజ్ @ ఎవరీ స్టెప్ 2.0' ప్రదర్శనలో పాల్గొన్న వరంగల్ ఎంపీ**

**హైదరాబాద్, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):** చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను పరిరక్షించి భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు.
ఖాజాగూడలోని మహాలక్ష్మి కోర్ట్‌యార్డ్‌లో ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'హెరిటేజ్ @ ఎవరీ స్టెప్ 2.0' ప్రదర్శనకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన చారిత్రక ఆధారాలు, దేవాలయాలు, శాసనాలు, పురాతన కట్టడాలు, పురావస్తు ప్రదేశాలకు సంబంధించిన ప్రదర్శనలను పరిశీలించారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ చరిత్రను అధ్యయనం చేయడం ద్వారా సమాజం తన మూలాలను, సంస్కృతిని మరింత లోతుగా అర్థం చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో చరిత్రపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారసత్వ పరిరక్షణకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.
ప్రిజర్వ్ హెరిటేజ్ ఫర్ పోస్టెరిటీ కార్యక్రమం ద్వారా మరుగునపడిన చారిత్రక, పురావస్తు విశేషాలను వెలుగులోకి తీసుకువస్తున్న ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈ. శివనాగిరెడ్డి సేవలను ఎంపీ అభినందించారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో చరిత్రాభిమానులు, పరిశోధకులు, విద్యార్థులు, సాంస్కృతిక రంగ ప్రతినిధులు పాల్గొన్నారు.





## గ్రామపంచాయతీ సిబ్బందికి గౌరవ వేతనం అందజేసిన సర్పంచ్ బిల్లా యాదగిరి

**వేలేరు, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి తన గౌరవ వేతనాన్ని గ్రామపంచాయతీ సిబ్బందికి అందజేశారు. గతంలో తన ఐదేళ్ల పదవీకాలంలో పొందే గౌరవ వేతనాన్ని పూర్తిగా గ్రామపంచాయతీ సిబ్బందికి అందజేస్తానని ప్రకటించిన ఆయన, ఆ హామీలో భాగంగా ఇప్పటివరకు అందిన ఐదు నెలల గౌరవ వేతనం రూ.32,500ను సిబ్బందికి అందించారు.ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బంది సర్పంచ్ బిల్లా యాదగిరి సేవాభావాన్ని అభినందిస్తూ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయ, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.





# మహిళల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### వరంగల్ ఎంపి కడియం కావ్య

- **రైజ్ హర్–2026 మహిళా సాధికారత సదస్సులో పాల్గొన్న వరంగల్ ఎంపీ**

**హైదరాబాద్,జులై18(తెలంగాణ ముచ్చట్లు):** మహిళల సంక్షేమం, సాధికారత, ఆర్థిక స్వావలంబనకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు.
హైదరాబాద్‌లోని రెడ్ హిల్స్‌లో తెలంగాణ ఎస్సీ/ఎస్టీ ఇండస్ట్రియల్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైజ్ హర్-2026 మహిళా సాధికారత సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సూచించిన "పే బ్యాక్ టు సొసైటీ" భావనను ప్రతి ఒక్కరూ ఆచరించాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షిస్తూ జాతీయ గౌరవాన్ని పెంపొందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.
స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేస్తూ మహిళల్లో పొదుపు, స్వయం ఉపాధి, పారిశ్రామికాభివృద్ధిని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ముఖ్యంగా ఎస్సీ మహిళలు విద్య, ఉద్యోగం, వ్యాపారం, నాయకత్వ రంగాల్లో మరింత ముందుకు వచ్చి సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని సూచించారు.
మహిళలు తమ ప్రతిభను చాటుకుని స్వావలంబన సాధిస్తే కుటుంబంతో పాటు సమాజం, రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, అదనపు డైరెక్టర్ శ్రీనివాస్ నాయక్, పీఎంఈజీపీ ప్రతినిధి రవి, ఎస్‌బీఐ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మూర్తి, విహబ్ డైరెక్టర్ జావేద్ అక్తర్ షేక్, టీఎస్ఐసీసీ అధ్యక్షుడు నల్ల బాబు తదితరులు పాల్గొన్నారు.





## ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

- **ఉమ్మడి వరంగల్ జిల్లాల సమీక్షకు సమగ్రంగా సిద్ధం కావాలి**
- **కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

**హనుమకొండ, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు.స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్‌తో కలిసి శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎల్‌నినో ప్రభావం, ముందస్తు చర్యలపై సంబంధిత శాఖలకు దిశానిర్దేశం చేశారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 21న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన హనుమకొండ కలెక్టరేట్‌లో జరగనున్న ఉమ్మడి వరంగల్ జిల్లాల సమీక్ష సమావేశానికి అన్ని శాఖలు సమగ్ర సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.
ప్రణాళిక, వ్యవసాయం, ఉద్యానవనం, భూగర్భ జలాలు, ఇంధన, మున్సిపల్ పరిపాలన, పంచాయతీరాజ్, పశుసంవర్థక, నీటిపారుదల తదితర శాఖలు తమ పరిధిలోని ప్రస్తుత పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులు, చేపట్టిన చర్యలు, ఎదురవుతున్న సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు సిద్ధం చేయాలని సూచించారు.భారత వాతావరణ శాఖ అంచనాలను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, అదనపు కలెక్టర్ ఎన్. రవి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





## రోగులకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించాలి

- **ఈఎస్ఐ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన హరి చందన దాసరి**

**హనుమకొండ, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీల శాఖ కార్యదర్శి హరి చందన దాసరి అధికారులను ఆదేశించారు.
హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి వరంగల్ లేబర్ కాలనీలోని ఈఎస్ఐ ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం సందర్శించిన ఆమె, వివిధ వార్డులను పరిశీలించి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది స్పందనపై వివరాలు తెలుసుకుని సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యాధికారులతో సమావేశమై వైద్య సదుపాయాలు, మౌలిక వసతులు, వైద్యులు, సిబ్బంది లభ్యత, ఔషధాల నిల్వలు, రోగులకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని హరి చందన దాసరి సూచించారు. పరిశుభ్రత, ఔషధాల లభ్యత, వైద్య సేవల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కాంతి సాగర్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ హేమలత, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆదివారం - 19 - జూలై 2026

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# వంగాలపల్లిలో ఉచిత ఆరోగ్య శిబిరం విజయవంతం

**చిల్పూర్, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):** జనగామ జిల్లా చిల్పూర్ మండలం వంగాలపల్లి గ్రామంలో లుమినిస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో, బాల వికాస్ సహకారంతో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు.శిబిరంలో గ్రామ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు, చికిత్స సూచనలు అందించారు. డా. సంధ్యారాణి ఆధ్వర్యంలోని వైద్య బృందం సభ్యులు డా. తేజస్విని, డా. సంకీర్తన, సిస్టర్ ప్రసన్న, కృష్ణవేణి, భారతి, సంపత్ రెడ్డి, భిక్షపతి, రాజేష్ ప్రజలకు వైద్య సేవలు అందించారు. బాల వికాస్ కోఆర్డినేటర్లు అనిత, కల్పన శిబిరం నిర్వహణలో సహకరించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భూక్యా మేనక, ఉపసర్పంచ్ అరూరి రవిచందర్ వైద్య బృందాన్ని అభినందించి, గ్రామ ప్రజలు ఇటువంటి ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.శిబిరం ద్వారా వైద్య సేవలు అందించిన లుమినిస్ హాస్పిటల్, బాల వికాస్ సంస్థలకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



# వంగాలపల్లి గ్రామపంచాయతీలో మొక్కల పంపిణీ

**చిల్పూర్, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):** జనగామ జిల్లా చిల్పూర్ మండలం వంగాలపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి మమత మాట్లాడుతూ, మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. ప్రతి ఇంటి ఆవరణలో, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు.ఉపసర్పంచ్ అరూరి రవిచందర్ మాట్లాడుతూ, గ్రామాన్ని పచ్చని వాతావరణంతో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గ్రామస్తులంతా మొక్కలను నాటి వాటిని సంరక్షించి భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొని మొక్కలను స్వీకరించి వాటిని నాటేందుకు ముందుకు వచ్చారు.

# రూ.549 పోస్ట్‌పెయిడ్‌కు ఎయిర్‌టెల్ గుడ్‌బై

**న్యూఢిల్లీ, జులై 18 (తెలంగాణ ముచ్చట్లు):** టెలికాం దిగ్గజం ఎయిర్‌టెల్ తన ప్రజాదరణ పొందిన రూ.549 వ్యక్తిగత పోస్ట్‌పెయిడ్ ప్లాన్‌ను నిలిపివేసింది. 2026 టారిఫ్ సవరణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో తక్కువ ఖర్చుతో పోస్ట్‌పెయిడ్ సేవలు వినియోగిస్తున్న కస్టమర్లపై అదనపు భారం పడనుంది. ఇకపై వ్యక్తిగత పోస్ట్‌పెయిడ్ విభాగంలో ఈ ప్లాన్ అందుబాటులో ఉండదు.




రూ.549 ప్లాన్‌లో అపరిమిత లోకల్, ఎస్‌టీడీ వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, నెలకు 40 జీబీ డేటాతో పాటు ఉపయోగించని డేటాను తదుపరి నెలకు బదిలీ చేసుకునే సదుపాయం ఉండేది. అదనంగా ఎక్స్‌ట్రీమ్ ప్లే, వింక్ మ్యూజిక్ సేవలను కూడా ఉచితంగా అందించేవారు. తక్కువ ధరలో ఎక్కువ ప్రయోజనాలు ఉండటంతో ఈ ప్లాన్‌కు వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభించింది. ఈ ప్లాన్‌ను ఉపసంహరించడంతో ప్రస్తుతం వ్యక్తిగత పోస్ట్‌పెయిడ్ వినియోగదారులకు రూ.449 ప్లాన్ మాత్రమే ప్రవేశ స్థాయి ఎంపికగా మిగిలింది. మరోవైపు, రూ.549 కంటే ఎక్కువ ప్రయోజనాలు కోరుకునే వారు నేరుగా రూ.699 ఫ్యామిలీ ప్లాన్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. దీంతో వినియోగదారులను అధిక ధరల ఫ్యామిలీ ప్లాన్‌ల వైపు మళ్లించే వ్యూహాన్ని ఎయిర్‌టెల్ అమలు చేస్తోందని టెలికాం రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# ఇదీ రహస్యం!

అడవికి రాజు
మృగరాజు!
దేశానికిరాజు
ఏమనిషైనా
కాగలడు!

మృగరాజు
ఆకలివేస్తేనే
వేటడతాడు!
మనిషిదిమాత్రం
నిరంతరవేట!

మృగరాజు
ఆకలితీరాగానే
వేట ఆపేస్తాడు!
వీడివేట డబ్బు!
ఆకలితీరదు!

తిన్నతర్వాత
మృగరాజు
గుహలో నిద్ర!
వీడు మాత్రం
దేశాల పర్యటన!

మృగరాజుకు
ఒక్క అడవే!
వీడిది మాత్రం
అన్ని దేశాలు
తిరగటమే !

మృగరాజుకు
అంతరంగికంలేదు!
వీడు మాత్రం
వీడిలాంటివాళ్ళతో
సమావేశాలు!

ఆకలి ప్రధానంగా
మృగరాజుపాలన!
దేశంలో 'పన్నులు'
విదేశీ 'సంపదలు '
వీడిఅంతరంగికం!

నిశిరాత్రిఅడవిలో
నిశ్శబ్దవాతావరణం!
రాజుగారి పాలనలో
రాత్రి పగలు
ప్రజల ఆహాకారం!

అడవిలో
ఆరోగ్యం ఆనందం
దేశంలో మాత్రం
రోగాలు, దరిద్రం
బాధలతో జనం!

మృగం మనిషి
అడవి దేశం
సమాజం ఉండి
సుఖంలేని మనిషి!
ఏంటంటారు?

మృగానిది
ఆహారంవరకే!
వీడిది మాత్రం
నిత్య దోపిడీ!
ఇదే రహస్యం!

**- తమ్మినేని అక్కిరాజు ,**
హైదరాబాద్

# వాంగ్‌చుక్ దీక్షపై ఉత్కంఠ

- **21వ రోజుకు చేరిన నిరాహార దీక్ష**
- **ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రికి తరలింపు**
- **జూలై 20న పార్లమెంట్ మార్చ్‌కు పిలుపు**



**న్యూఢిల్లీ, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రవేశ పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష 21వ రోజుకు చేరింది. దీర్ఘకాలంగా ఆహారం తీసుకోకపోవడంతో ఆయన ఆరోగ్యం క్షీణించగా, ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు, వైద్యుల సూచనల మేరకు శనివారం ఉదయం ఢిల్లీ పోలీసులు ఆయనను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ నిరంతర వైద్య పర్యవేక్షణ అవసరమని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. నీట్‌తో పాటు ఇతర జాతీయ ప్రవేశ పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలపై బాధ్యత వహించాలని వాంగ్‌చుక్ డిమాండ్ చేస్తున్నారు. పరీక్షల వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు తీసుకురావాలని, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే అక్రమాలను అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని ఆయన కోరుతున్నారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. ఆసుపత్రికి తరలించిన తీరుపై వాంగ్‌చుక్ కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తన అనుమతి లేకుండా భర్తకు ఎలాంటి చికిత్స చేయవద్దని ఆయన భార్య గీతాంజలి జె. ఆంగ్మో స్పష్టం చేశారు.

మరోవైపు ఢిల్లీ పోలీసులు మాత్రం హైకోర్టు ఆదేశాలు, వైద్యుల సిఫారసుల మేరకే ఈ చర్య చేపట్టామని వెల్లడించారు. జంతర్‌మంతర్ వద్ద నిరసనకారులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొన్నప్పటికీ పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చామని తెలిపారు. వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించిన ఘటన రాజకీయంగా కూడా దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించగా, నిరసన హక్కును అణచివేస్తున్నారంటూ ఆరోపించాయి. మరోవైపు వాంగ్‌చుక్‌కు మద్దతుగా దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు, సామాజిక సంస్థలు సంఘీభావం ప్రకటిస్తున్నాయి.

వాంగ్‌చుక్‌కు మద్దతుగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని నిరసనకారులు ప్రకటించారు. ఉద్యమ నాయకుడు అభిజీత్ దిప్కే కూడా నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించినట్లు ప్రకటించగా, ఈ నెల 20న పార్లమెంట్ వరకు శాంతియుత నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ పరిణామాలతో రాజధాని ఢిల్లీలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. వాంగ్‌చుక్ నిరాహార దీక్ష దేశవ్యాప్తంగా ప్రవేశ పరీక్షల నిర్వహణ, విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనంపై విస్తృత చర్చకు దారితీసింది. పరీక్షల నిర్వహణలో విశ్వసనీయతను పెంచేందుకు సంస్కరణలు అవసరమని విద్యావేత్తలు అభిప్రాయపడుతుండగా, కేంద్ర ప్రభుత్వం తదుపరి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

# విక్రమ్–1తో చరిత్ర సృష్టించిన భారత్

- **స్వదేశీ ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ విజయవంతం**
- **శ్రీహరికోట నుంచి నింగిలోకి దూసుకెళ్లిన విక్రమ్-1**
- **భారత అంతరిక్ష రంగంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం**

**శ్రీహరికోట, జూలై 18 (తెలంగాణ ముచ్చట్లు):** భారత అంతరిక్ష రంగంలో మరో చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు అంతరిక్ష సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ పూర్తిగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ‘విక్రమ్ 1’ ఆర్బిటల్ రాకెట్‌ను శనివారం విజయవంతంగా ప్రయోగించింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి నింగిలోకి దూసుకెళ్లిన ఈ రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో వాణిజ్యపరంగా సొంత ఆర్బిటల్ రాకెట్లను అభివృద్ధి చేసి ప్రయోగించిన కొద్ది దేశాల సరసన భారత్ నిలిచింది. ‘మిషన్ ఆగమన్’ పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం భారత ప్రైవేటు అంతరిక్ష పరిశ్రమకు కొత్త దిశను చూపించింది. ప్రయోగానికి ముందు స్వల్ప సాంకేతిక సమస్య తలెత్తడంతో కొద్దిసేపు వాయిదా వేసినప్పటికీ, అనంతరం అన్ని వ్యవస్థలు సక్రమంగా పనిచేయడంతో రాకెట్ విజయవంతంగా ప్రయాణం ప్రారంభించింది. నాలుగు దశల రాకెట్ నిర్దేశిత ప్రణాళిక ప్రకారమే పనిచేసి, ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టడంలో తొలి ప్రయత్నంలోనే విజయం సాధించింది. దాదాపు ఏడు అంతస్తుల భవనం ఎత్తుతో రూపొందించిన విక్రమ్ 1 రాకెట్‌ను పూర్తిగా కార్బన్ కాంపోజిట్ పదార్థాలతో నిర్మించారు. ఇది సుమారు 350 కిలోల బరువున్న పేలోడ్లను భూమికి సమీప కక్ష్యలోకి తీసుకెళ్లగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇందులో ఉపయోగించిన ఆధునిక ప్రొపల్షన్ వ్యవస్థలు, త్రిమితీయ ముద్రణ సాంకేతికతతో తయారు చేసిన ఇంజిన్లు, అధిక సామర్థ్యం గల ఘన ఇంధన రాకెట్ మోటార్లను స్కైరూట్ సంస్థ స్వయంగా అభివృద్ధి చేయడం విశేషం. ఈ తొలి ప్రయోగంలో గ్రాహ్ స్పేస్, కాస్మోసర్వ్, డీక్యూబ్డ్ సంస్థలకు చెందిన సాంకేతిక ప్రదర్శన పేలోడ్లతో పాటు స్కైరూట్ రూపొందించిన ‘స్కోప్’ పేలోడ్‌ను కూడా అంతరిక్షంలోకి పంపించారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వదస్తూరితో రాసిన ‘వందేమాతరం’ పోస్టుకార్డు, ఇస్రో ప్రస్తుత, మాజీ ఛైర్మన్లు, భారత వ్యోమగాములు, స్కైరూట్ ఉద్యోగులు, పెట్టుబడిదారుల సందేశాలను కూడా ఈ ప్రయోగంలో అంతరిక్షంలోకి పంపడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ విజయం కేవలం ఒక రాకెట్ ప్రయోగం మాత్రమే కాకుండా, భారత అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల పాత్రను మరింత బలోపేతం చేసిన ఘట్టంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అంతరిక్ష రంగ సంస్కరణలకు ఇది కీలక విజయంగా నిలవడంతో పాటు, భవిష్యత్తులో వాణిజ్య ఉపగ్రహ ప్రయోగాల రంగంలో భారత సామర్థ్యాన్ని మరింత పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ప్రయోగం ద్వారా సేకరించిన సాంకేతిక సమాచారం ఆధారంగా విక్రమ్ శ్రేణి రాకెట్లను మరింత అభివృద్ధి చేయనున్నట్లు సంస్థ తెలిపింది. ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా 2018లో స్కైరూట్ ఏరోస్పేస్‌ను స్థాపించారు. 2022లో ‘విక్రమ్‌ఎస్’ ఉపకక్ష్య రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించి చరిత్ర సృష్టించిన ఈ సంస్థ, ఇప్పుడు ‘విక్రమ్ 1’ విజయంతో మరో మైలురాయిని చేరుకుంది. చిన్న ఉపగ్రహాల ప్రయోగాలకు తక్కువ వ్యయంతో, విశ్వసనీయ సేవలు అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్న స్కైరూట్ విజయంతో భారత అంతరిక్ష యానంలో ప్రైవేటు రంగం కూడా కీలక శక్తిగా ఎదిగిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.




Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in